# భద్రాద్రి యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులో అవినీతిపై విచారణకు సిబిఐకి అప్పగింత

## మంత్రి మండలి ఆమోదం

హైదరాబాద్, బతుకమ్మ:గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో అవినీతి ఆరోపణలపై జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని కమిషన్ నివేదికపై తదుపరి దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించడానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ లోకూర్ గారి నేతృత్వంలోని కమిషన్ అందజేసిన 114 పేజీల నివేదికపై రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సూచనలు, అభిప్రాయాలపై మంత్రిమండలి చర్చించింది. ఇందులో అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉండటం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో ముడిపడి ఉన్నందున దీనిపై సమగ్రమైన, నిష్పాక్షిక దర్యాప్తు కోసం ఈ వ్యవహారాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలని మంత్రిమండలి తీర్మానించింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, వాకిటి శ్రీహరి గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లిన సమాచారంపై మంత్రివర్గం చర్చించింది. ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని, రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా నిర్ణయించింది. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉండటమే కాకుండా, ధరలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలించింది. దాంతో పాటు మార్కెట్ ధరలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో శాస్త్రీయ పద్ధతిలో ధరలను సవరించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ?

భూముల ధరలు పెరిగేలోపు హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా





ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం భావించింది. దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పుడున్న ధరల మేరకు ముందుగా 10 శాతం చెల్లించే వెసులుబాటు కల్పించి, మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించే విధంగా నిర్ణయించింది.రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు (అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్ కాలేజీలు, టీ శాట్‌ను ఇకనుంచి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చి ఒకే గొడుగు నిర్వహించాలని నిర్ణయించింది. నల్గొండ - రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగించే ఎంఓయూకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ - రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ (చీూ=పీూజ) కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్‌డీబీ నిర్వహిస్తుంది. తెలంగాణలో 9 ఉమ్మడి జిల్లాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల సమీపంలో సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పైలెట్ ప్రాజెక్టుగా 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పెండింగ్‌లో ఉన్న పన్నులను క్లియర్ చేసుకోవడానికి వీలుగా వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ూూ) వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపిశీది

# వరి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మోర్తాడ్, బతుకమ్మ :కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ధాన్యం సేకరణ తీరును నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మోర్తాడ్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఇదే మండలంలోని దోన్పాల్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని, ట్రక్ షీట్ వివరాలు తమకు అందించడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, మోర్తాడ్ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జి దిలీప్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీసీఓను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా పని చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. పంట సాగు చేసిన ప్రతి రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, వరుస క్రమంలో రైతుల వివరాలు నమోదు చేసుకుని, ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం వేగంగా దిగుమతి చేసుకుని, సత్వరమే ట్రక్ షీట్లు అందించేలా చూడాలని తహసీల్దార్ ను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే






నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రాన్ని సందర్శిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, శుభ్రపరచి బాగా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు

### కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి

### పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు




హైదరాబాద్ , బతుకమ్మ:తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ...8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించను న్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియో గంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు.

"పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" పోస్టర్ ఆవిష్కరణ

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాకు నీళ్లు ఇచ్చే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సహా మూడు ప్యాకేజీల పనులను 11 ఏళ్ల తర్వాత కూడా ప్రారంభించకపోవడంపై ఉద్యమానికి కవిత శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.